www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు

బంగారుపాళ్యం యూటీఎఫ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బంగారుపాళ్యం నూతన కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా రామ్మూర్తి, మండల అధ్యక్షులుగా మహేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెడ్డి అసోసియేట్ సభ్యులుగా బాలాజీ, అమూల్య, కోశాధికారిగా బాలాజీ, కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, చెంగయ్య, వెంకటరమణ, పార్వతి, సుమలత, జిల్లా కార్యదర్శులుగా మహేష్ బాబు, మోహన్ రెడ్డి, మొగులయ్య, ధనుంజయ ఎన్నికయ్యారు.

మహేష్ బాబు

మోహన్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయండి: ఎంపీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని జెడ్పి సమావేశ మందిరంలో చిత్తూరు ఎంపి అధ్యక్షతన, కలెక్టర్ సుమిత్ కుమార్ సెక్రెటరీగా మొదటి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు, జీడి నెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, డాక్టర్ విఎం థామస్, కె.మురళి మోహన్, నగర మేయర్ అముద, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా చేపడుతున్న దాదాపు 40రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, వాటికి చేసిన ఖర్చు వివరాలను సమీక్షిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన నిధులను మండలాలకు, గ్రామాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అందిన నిధులను కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే సిసి రోడ్డులు, మురుగు నీటి కాలువల నిర్మాణం, తదితర అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో పని చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిచేలా భాద్యతతో పని చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలు వాటి అమలు తీరు సమీక్ష ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా టిబి మిషన్, హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ మిషన్‌లకు కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి 14వ మరియు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలని, గ్రామాలలో పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి లైట్‌లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ఎన్ఆర్ఈజిఎస్, జల్ జీవన మిషన్, విద్యా శాఖ, హౌసింగ్ శాఖ సంబంధిత శాఖల ద్వారా అమలవుతున్న పథకాలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాలో అమలవుతున్న పథకాల తీరు తెన్నులు వాటి పురోగతిని ఎంపి, ఎమ్మెల్యేలకు కలెక్టర్ వివరించారు. ప్రధానంగా జిల్లాలోని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో వైద్య పరికరాలు ఉన్నప్పటికీ తగినంత సిబ్బంది లేరని, వైద్య ఆరోగ్య శాఖలో భవనాలు, సిబ్బంది కొరత కొంత మేర ఉందని, ఇందుకు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధికి అవసరమైన మేర షెడ్‌ల మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని, టిడ్కో గృహ సముదాయాలు, హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు శ్రద్ధ పెట్టాలని కోరారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, వేద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుం

పట్టు తప్పితే..? తప్పెవరిది..? బాధ్యులెవరు..?

ప్రజాశక్తి - రామకుప్పం: పాఠశాలకు వెళ్లిన విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఉపాధ్యాయులే.. విద్యార్థులను సంతకు పశువులను తరలించే రీతిలో ఓ లగేజీ వాహనంలో క్రీడల కోసం ప్రమాదకర రీతిలో బాధ్యతా రహితంగా తీసుకెళ్లిన వైనం ఇది. మండల పరిధిలోని చెల్దిగానిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను రామకుప్పం సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద జరుగుతున్న క్రీడ పోటీల కోసం శుక్రవారం లగేజీ వాహనంలో ప్రమాదకరంగా తరలించారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఇందుకు భాద్యులు ఎవరని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై విద్యా శాఖ ఉన్నతధికారులు స్పందించల్సి ఉంది.

లగేజీ వ్యానులో ప్రమాదకరంగా విద్యార్థులు ఇలా..

అన్నప్రసాదం, పారిశుధ్యానికి పెద్దపీట

శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వారం కంటే తక్కువ సమయం ఉన్నందున, తొమ్మిది రోజుల పాటు ఉత్సవాల ఏర్పాట్లను, టీటీడీలోని అన్ని విభాగాలపై టీటీడీ ఈవో జె శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి సమీక్షించారు. తిరుమల అన్నమయ్య భవనంలో వార్షిక బ్రహ్మోత్సవాల తుది సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అన్ని శాఖల ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అన్నప్రసాదం, ఆరోగ్య విభాగాలు రెండు ముఖ్యమైన విభాగాలుగా ఒకదానికొకటి సమన్వయం చేసుకుని దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. "అన్నప్రసాదం వడ్డించడం పూర్తయిన వెంటనే, చెత్తను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఆలస్యం చేయకుండా ఆరోగ్య శాఖ పారిశుధ్య కార్మికులను ఆదేశించాలని సూచించారు. అనంతరం ఇంజినీరింగ్ పనులు, శ్రీవారి ఆలయం, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, గార్డెన్, ఫారెస్ట్‌లు, నత్యం, భజన బందాలు, రవాణా, గోశాల, మెడికల్ విభాగాలను ఈవో పరిశీలించారు. శ్రీవారి సేవకుల సేవలను ఆయా విభాగాలు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌వో వరప్రసాద్, సిఈ సత్యనారాయణ, ఎఫ్ఎసిఎఓ బాలాజీ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడేందుకే పాదయాత్ర : రామచంద్ర యాదవ్

తిరుమలకు పుంగనూరు నుంచి పాదయాత్ర

ప్రజాశక్తి -పుంగనూరు

తిరుమల పవిత్రతను కాపాడి హైందవ ధర్మం పునరుద్ధరణకు, శాస్త్రోక్తంగా స్వామి వారి సేవలు నిర్వహించాలని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఉన్నారు. స్థానిక హనుమంతురాయి దిన్నెలో ఉన్న విరా ఆంజనేయ స్వామి ఆలయంలో మఠాధిపతులు, పీఠాధిపతులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడడానికి తిరుమల పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు యదిరాజు రామనాథ చిన్న జీయర్ స్వామి, అయోధ్య శ్రీ హనుమాన్ మఠాధిపతి కళ్యాణ్ దాస్, స్వరూపానంద సరస్వతి, యాదవ నంద సరస్వతి పాల్గొన్నారు. శుక్రవారం రాత్రికి ఈ యాత్ర సోమలకు చేరుకుంది.

మున్సిపల్ ఇంజినీరుగా వెంకటరామి రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజనీరు(ఎంఈ)గా బి.వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ ఎంఈగా పనిచేస్తున్న గోమతిని తిరుపతి నగర పాలక సంస్థకు, అక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న వెంకటరామి రెడ్డిని చిత్తూరు నగరపాలక సంస్థ ఎంఈగా బదిలీ చేశారు. శుక్రవారం భాద్యతలు చేపట్టిన ఎంఈ.. మేయర్ ఎస్.అముద, నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు నూతన ఎంఈని కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిఖితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సోమల: చిత్తూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడలలో నంజంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తోట నిఖిత డిస్కస్ త్రో లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాల హెచ్ఎం కుసుమాంబ వివరాలను తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగబోవు రాష్ట్ర స్థాయి పోటీలకు నిఖిత హాజరుకానున్నట్లు చెప్పారు. నిఖితను, వ్యాయామ ఉపాధ్యాయురాలు నూర్జహాన్‌ను అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇటీవల జరిగిన బదిలీల్లో నూతనంగా నియమితులైన అధికారులు శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఐసిడిఎస్ పీడీ హైమావతి, డ్వామా పీడీ రవికుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం సుబ్బారావు, ఎక్సైజ్ డిసి విజయ్ కుమార్‌లు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

వార్డు స్థాయిలో 'మన ఇల్లు మన గౌరవం' సమావేశాలు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: హౌసింగ్ ప్రోగ్రాం సంబంధించి వార్డు సచివాలయం స్థాయిలో "మన ఇల్లు మన గౌరవం" కార్యక్రమాన్ని నిర్వహించి లబ్దిదారులకు అవగాహన కల్పించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం లేఅవుట్లలో హౌసింగ్ పురోగతిపై హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హౌసింగ్ లబ్దిదారులతో వార్డు సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి వీలుగా తాపీ మేస్త్రిలను అనుసంధానం చేయడం, మెటీరియల్ సరఫరా చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు స్టేజ్ కన్వర్షన్ చేయించాలన్నారు. రోజువారీగా లేఅవుట్లను సందర్శించి, లబ్దిదారులను సమన్వయం చేసుకొని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

రాయల్‌కోటలో 'లైట్ అండ్ సౌండ్' షో వెలుగులు

చంద్రగిరి కోటలో లైట్ అండ్ సౌండ్ షో ం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి రాయలకోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'లైట్ అండ్ సౌండ్ షో' పున్ణప్రారంభమయ్యింది. శుక్రవారం సాయంత్రం ప్రపంచ పర్యాటక దినం పురష్కరించుకుని చంద్రగిరి క్లాక్ టవర్ సెంటర్ నుండి చంద్రగిరి కోట వరకు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో, ప్రజలతో కలిసి హెరిటేజ్ వాక్ ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగ అభివద్ధికి మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. తిరుపతి జిల్లాలో తిరుమల శ్రీవారి దేవాలయం, శ్రీకాళహస్తి తదితర పుణ్య క్షేత్రాలు, బీచ్ రిసార్ట్ లు, జలపాతాలు తదితర పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ఆ తర్వాత వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జెసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం సుమారు 3.50 కోట్లతో ఏర్పాటు చేసిన చంద్రగిరి సౌండ్ అండ్ లైట్స్ షో ను జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రారంభించారు. త్వరలోనే ఫుడ్ కోర్టు, బోటింగ్ ఏర్పాటు చేయనున్నారని, సౌండ్ అండ్ లైట్స్ ఏర్పాటుతో కలిపి సుమారు రూ.6 కోట్లు మొత్తం ప్రాజెక్టు విలువ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటిడిసి డివిఎం గిరిధర్ రెడ్డి, ఈఈ సుబ్రమణ్యం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వి. శేఖర్, చంద్రగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

జెడ్పీ భవిష్యనిధి ఖాతాలను సత్వరమే క్రమబద్ధీకరించాలి

వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జెడ్పీ భవిష్యనిధి ఖాతాలను సత్వరమే క్రమబద్ధీకరించాలని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడుకి యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. జెడ్పీ సీఈవోగా ఆయన నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా జెడ్పీ పరిధిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్య నిధి ఖాతాలు నెలవారి వివరాలను ఆన్లైన్ ద్వారా తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారని, 2021-22 నుంచి 2023-24వరకు సంవత్సరాలు వారీగా ఉద్యోగి ఖాతాలో ఉన్న భవిష్యనిధికి వడ్డీని జమ చేసి అందుబాటులో తీసుకురావాలన్నారు. ఇటీవల కాలంలో ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ద్వారా కొత్త పాఠశాలల్లో నియామకం పొంది ఉన్నారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల చిరునామాలను సవరణ చేయాలని కోరారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు మంజూరు చేయాలన్నారు. కారుణ్య నియామకా లను సత్వరమే చేపట్టాలని కోరారు. సీఈవోను కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణి గండన్, నాయకులు సుధాకర్ రెడ్డి, రెహానా బేగం, రెడ్డెప్ప నాయుడు, బాషా, సరిత, ఏకాంబరం, పార్థసారథి పాల్గొన్నారు.

నృత్య కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఆస్థాన మండపంలో నిర్వహించిన కళాకారుల నృత్య ప్రదర్శనను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ వీక్షించారు. అనంతరం చిత్తూరు విజయం విద్యా సంస్థలకు చెందిన నృత్య కళాకారులు ఎం.పరిణిత, శ్రీచరణ్య, సుకృతి, తేహిష్, లక్షీశ్వరీలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. చదివుతో పాటుగా భారత సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే భరత నాట్యాం వంటి కళల పట్ల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విజయం విద్యా సంస్థ యాజమాన్యంను ప్రశంసించారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

గతమెంతో ఘనకీర్తి

ఎన్టీఆర్ మానస పుత్రిక 'స్విమ్స్'

ప్రజాశక్తి- తిరుపతి

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మానసపుత్రికగా, టిటిడి సారధ్యంలో 1993లో ఏర్పాటైన స్విమ్స్ దినదినాభివృద్ధి చెందుతూ రాయలసీమలోనే ఏకైక సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చెందింది. తిరుమల తిరుపతి దేవస్థానం సైతం శ్రీవారి భక్తులు, యాత్రికుల సౌకర్యాల తర్వాత అంతటి ప్రాధాన్యతను విద్యా, వైద్య రంగాలకు ఇవ్వడంతో అనతికాలంలోనే ఆర్థికంగా స్విమ్స్ పరిపుష్టిని సాధించింది. అత్యాధునిక వైద్య పరిశోధనా, విజ్ఞాన సంస్థగా ఆవిర్భవించింది. ఆధునిక వైద్యం ప్రైవేటీకరణ అయినప్పటికీ దాదాపు మూడున్నర దశాబ్దాలుగా పేద, మధ్యతరగతి వర్గాల వారికి అతితక్కువ ఖర్చులతోనే కార్పొరేట్ వైద్యాన్ని చేరువచేసింది. 'శ్రీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని' పథకం ద్వారా ఓపీలకు ఫీజులు చెల్లించుకోలేని నిరుపేదల కోసం ప్రతి ఆదివారం ఉచిత క్లినిక్‌లను నిర్వహించేది. మూర్ఛరోగానికి మందే లేదు అనే రోజుల్లోనే..ఎపిలెప్సీకి మందులే కాదు..ఖచ్చితమైన చికిత్సా ఉందంటూ నిరూపించింది. నెలలో ప్రతి మూడో ఆదివారమూ ఉచిత ఎపిలెప్సీ క్లినిక్‌లను (250 కి పైగా) నిర్వహించి మందులను ఇస్తూ..రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని 93వేల మంది మూర్ఛరోగుల పాలిట కల్పవృక్షంగా మారి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. దాదాపు 11,360 మందికి పైగా నిరుపేద రోగులకు శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి 'ప్రాణదానం' చేసింది.

'ప్రజాశక్తి' కథనాలపై 'స్విమ్స్' వివరణ

ప్రజారోగ్య ప్రస్థానంలో పేదరోగులకు పెన్నిధిగా ఉంటూ ఎంతో ఉదారంగా వ్యవహరించిన స్విమ్స్ నేడు కొన్ని డిపార్టుమెంట్లలో ఆ బాధ్యతల నుంచి క్రమేపీ తప్పుకుంటుండడంతో ..'ప్రజాశక్తి'లో గత మూడు రోజులుగా ' నెప్రో ప్లస్ లైఫ్ లెస్', ' పక్కా కమర్షియల్', ' రోగుల్లారా..రాకండి ' అంటూ వరుస కథనాలను ప్రచురించింది. అయితే ఈ కథనాలపై స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ స్పందించి, వీటన్నింటిపైనా వివరణ ఇస్తూ.. డయాలసిస్ రోగులకు నెప్రోప్లస్ ద్వారా మరింత మెరుగైన సేవల్ని అందించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. డయాలైజర్ వల్ల రోగులు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా పలుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అర్హులైన పేదవారికి ఉచిత వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ, ప్రాణదానం, బాలాజీఆరోగ్యవరప్రసాదిని పథకాలనూ అమలుచేస్తున్నామని, ఎపిలెప్సీ లాంటి క్యాంపులనూ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్విమ్స్ యంత్రాంగం కృషిచేస్తోందని ప్రకటించారు.

అయ్యో.. ఎంత ఘోరం!

అష్రఫ్, సాదిక్ మృతదేహాలు

రోడ్ రోలర్

- వాచ్‌మెన్‌లపైకి దూసుకెళ్లిన రోలర్
- అక్కడికక్కడే ఇద్దరూ మృతి
- శోకసంద్రమైన పల్లె

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా): కడు పేదరికంలో ఇంటికి ఆసరాగా నిలుద్దామనుకొన్న ఇద్దరు యువకులు ఊరి సమీపంలో రహదారి నిర్మాణ పని చేస్తున్న కంపెనీలో పనికిలో చేరారు. ఏడాదిన్నరగా వాచ్‌మెన్ ఉద్యోగం చేసుకొంటూ పగటిపూట ఒకరు వ్యవసాయ పనులు చేస్తుండగా ఇంకొకరు మెకానిక్ పనిచేసుకొంటూ కుటుంబానికి ఆదరవుగా నిలుస్తున్నారు. రాత్రిల్లో ఆ కంపెనీలో వాచ్‌మెన్‌గా ఉంటున్నారు. ఈ క్రమంలో ఎప్పటిలానే గురువారం రాత్రి డ్యూటీకి వెళ్లారు. అక్కడ రోడ్ రోలర్ రూపంలో మృత్యువు వారిని కబళించింది. రోలర్ కింద విగతజీవులుగా మారారు. వివరాల్లోకి వెళితే...

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామం వద్ద ఓ కంపెనీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతోంది. అదే గ్రామంలో ఉంటున్న యువకులు అశ్రఫ్(24), సాదిక్(26)లు ఆ పనుల వద్ద వాచ్‌మెన్‌లుగా పనిలో చేరారు. ఏడాదిన్నరగా అక్కడ పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఎప్పటిలానే డ్యూటీకి వెళ్లారు. రాత్రి 2గంటల వరకూ అక్కడ పరికరాలు, యంత్రాలు, పనులకు కాపలాగా ఉన్నారు. కాస్తంత కునుకు రావడంతో సమీపంలోని ఓ గడ్డ (మట్టి దిమ్మె) ప్రదేశంలో నిద్రించారు. లైట్ వెలుతురులో రోడ్డు పనులు చేస్తున్న రోడ్ రోలర్ అటుగా వచ్చింది. నిద్రలో ఉన్న యువకులను గుర్తించని రోలర్ డ్రైవర్ వారిపైకి దూసుకెళ్లాడు. దీంతో యువకులిద్దరూ రోలర్ కింద నుజ్జునుజ్జైయ్యారు. దీంతో సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకొన్నారు. విగతజీవులుగా పడి ఉన్న అశ్రఫ్, సాదిక్‌ల మృతదేహాలను చూసి గుండెలవిసేలా బోరున విలపించారు. కుటుంబానికి చేదోడువాదోడు ఉంటూ అందరితో సఖ్యతగా ఉంటున్న యువకులు మృతి పట్ల ఆ గ్రామం శోకసంద్రంలో మునిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అష్రఫ్(ఫైల్)

సాదిక్(ఫైల్)

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విజయపురం: మండలం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని మల్లకుంట రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయాధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉలవలు పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉలవలు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని చిన్నారిదొడ్డి గ్రామ పంచాయతీలో సర్పంచ్ రేణుక బాలసుబ్రమణ్యం పర్యవేక్షణలో దోమల నివారణకు శుక్రవారం ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, పాండురంగ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-సదుం: పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యాన్ని పొందొచ్చునని ఐసీడీఎస్ సూపర్వైజర్ మల్లీశ్వరీ అన్నారు. శుక్రవారం సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు, బాలికలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ రకాల పౌష్టికాహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తల ప్రతినిధులు అనసూయమ్మ, యశోదమ్మ, గీత, హేమ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై నల్ల రంగు!

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కలియంబాకం సచివాలయం నూతనంగా నిర్మించిన ఆర్‌బికే భవనం ప్రారంభోత్సవం శిలాఫలకాన్ని కొందరు నల్ల రంగు వేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై వైసీపీ నాయకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ బలరాం, ఏవో రజిని కుమారి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి

- సిడిపిఒ వాణిశ్రీదేవి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారంతో పాటు న్యూట్రిషన్ ఆహారాన్ని తీసుకోవాలని, అదేవిధంగా గ్రామంలోని ప్రజలకి ప్రతి ఒక్కరు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందువలన తాజా కూరగాయలు ఆకుకూరలు లభిస్తాయని వాటి ద్వారా మనిషి కావలసిన విటమిన్ తీసుకోవచ్చునన్నారు. అనంతరం పౌష్టికాహార లభించే ఆకుకూరలు కాయగూరలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయశ్రీ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా వరదరాజులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు విద్యుత్ శాఖ ఏఈగా వరదరాజులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజా చిత్తూరుకు బదిలీ కాగా, పాలసముద్రం నుంచి వరదరాజులు బదిలీపై వచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఏఈ స్పష్టం చేశారు.

ఏఈ వరదరాజులు

పలమనేరు మండల సర్వేయర్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి-పలమనేరు: మండల సర్వేయర్‌గా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పలువురు సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

బంగారుపాళ్యం ఏఈగా హేమచంద్రుడు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యుత్ ఏఈగా హేమచంద్రుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో బైరెడ్డిపల్లిలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. పలువురు సిబ్బంది ఆయనను సత్కరించారు.

సబ్ రిజిస్ట్రార్‌గా సర్వేశ్వర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు సబ్ రిజిస్ట్రార్‌గా సర్వేశ్వర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్ బాలాజీ శ్రీకాళహస్తికి బదిలీపై వెళ్లారు. బంగారుపాలెంలో పని చేస్తున్న సర్వేశ్వర్ రెడ్డి పుంగునూరుకు బదిలీపై వచ్చారు. ఆయనకు డాక్యుమెంట్ రైటర్ల సంఘం స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

నగరంలో స్వచ్ఛత హి సేవా ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ, మనవహారం నిర్వహించారు. ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నగరంలో చర్చి వీధి, పొన్నియమ్మ గుడి వీధిలో స్థానిక వ్యాపారస్తులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి వ్యాపారస్తులు, దుకాణదారుల సహకారం ఎంతో అవసరమన్నారు. దుకాణదారులు వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా చెత్త డబ్బాల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చర్చి వీధిలోని నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి "స్వచ్ఛత ప్రతిజ్ఞ" నిర్వహించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు లోకానాంథం, నరసింహ, చిత్తూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మహేష్, వార్డ్ పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, దుకాణదారులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ హైవే అథారిటీ కెసిసి కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇండియా చిత్రపటం ఆకట్టుకుంది. అనంతరం గంగాధర నెల్లూరులో గ్రీన్ అంబాసిడర్‌లకు అధికారులు సన్మానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ పీడీ కార్తీక్ రెడ్డి, లాహిరి అథారిటీ మేనేజర్ మణి ప్రసాద్, తహశీల్దార్ చంద్రశేఖర్, డిటీ తులసిరామ్, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, హెచ్ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో

కార్వేటినగరం: స్వచ్ఛత సేవకు విద్యార్థులు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో పరిసరాల పారిశుద్ధ్యం కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పోలీసేస్టేషన్ ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే చంద్రబాబు లక్ష్యం

ఎస్ఆర్ పురంలో

ప్రజాశక్తి-గుడిపల్లి: స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దడమే చంద్రబాబు లక్ష్యం అని టీడీపీ మండల అధ్యక్షులు బాబు నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అధికారులకు ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో బాబు నాయుడు పాల్గొని పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీతారాం, ఎంపీడీవో తాజ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన సదస్సును ఎంపీడీవో మోహన్‌మురళి నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ లోకనాథ పిళ్లై, ఎంఈఓ సబర్మతి, ఈఓపిఆర్డి పురుషోత్తం, ఏవో డాక్టర్ సందీప్ రాజ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం డాక్టర్.వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం తలపెట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద ప్రారంభించారు. కార్యక్రమంలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను శుక్రవారం విద్యార్థులకు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ఐక్యుఏసి కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశు, డాక్టర్ భీమమోహన్ రావు నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి

- జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రతి పంచాయతీలోని బృందావనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం అన్నారు. శుక్రవారం కార్వేటినగరం, ఆలత్తూరు గ్రామాల్లోని బృందావనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. బృందావనాలలో తడి, పొడి చెత్తలను విడివిడిగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో లక్ష్మీపతి, ఈవో మణి, సర్పంచ్ ధనంజయ వర్మ, పుష్పాంజలి, మాజీ ఎంపీపీ జనార్ధన్ రాజు, టిడిపి నాయకులు తంబయ్య, పరందాం దయానిధి, రుక్కుబాబు, ఏకాంబరం, హరికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

బృందావనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం

ఆత్మగౌరవానికి మరుగుదొడ్లు అవసరం

ప్రజాశక్తి-రామకుప్పం: సమాజంలో ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఎంపీడీవో ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 'మన ఇల్లు..మన గౌరవం' కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో 5వేల పైగా మరుగుదొడ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణం చేపట్టాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.15వేల చొప్పున అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జ్ రాధాకృష్ణ, నరసింహులు, విశ్వనాథ్, సుబ్రి, బాలు, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ నారాయణ, ఏపీఎం శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌రెడ్డిం

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేద్దాం

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కెంచనబళ్ల గ్రామపంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీతో నిరుద్యోగులకు సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం చేశారన్నారు. నియోజకవర్గానికి 5 వందల గోకులాల పశువుల షెడ్లు ప్రవేశపెట్టారన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికి ఈ షెడ్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రామకుప్పం మండలానికి పెద్ద పరిశ్రమ తీసుకువచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో కార్గో ఎయిర్పోర్ట్ ఏర్పాటు అయితే ఇక్కడ ఉన్న నిరుద్యోగులకు ఉపాధి, రైతులకు ఉద్యానవన పంటలతో కూరగాయలను ఎగుమతులు చేయవచ్చని.. దీంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నారాయణ చారి, ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, రామ్మూర్తి, సుబ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

కార్వేటినగరం: రాష్ట్రంలో మంచి ప్రభుత్వం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ప్రజలు 164 ఎమ్మెల్యేలను గెలిపించడం ఎందుకు నిదర్శనమని జీడి నెల్లూరు బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ అన్నారు. కార్వేటినగరంలో 100 రోజులలో తీసుకొచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు జగన్నాథం, హరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ దొంగలు అరెస్ట్

- 23ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మీడియాతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుంగనూరు: అంతరాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 23బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సిఐ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పుంగనూరు పట్టణంతో పాటు వివిధ సమీప పట్టణాల్లోనూ అంతర్ రాష్ట్రాల్లోనూ ఎక్కువగా చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ప్రత్యేక బృందాలుగా విడిపోయి పలు కోనాల్లో దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. బైక్ దొంగల కదలికలపై నిఘా ఉంచామన్నారు. ముఠా సభ్యులు మొత్తం ఐదు మంది కలసి వివిధ ప్రాంతాలలో పాటు కర్ణాటక రాష్ట్రం ముల్బాగల్లో కూడా ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. వీరు మండలంలోని చదళ్ళ గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నట్లు గుర్తించామన్నారు. చోరీ చేసిన వాహనాలను అందులో పెట్టి అతి తక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నట్లు తేలిందన్నారు. నిఘా వర్గానికి సమాచారం అందడంతో దాడులు చేసి వీరిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారి వద్ద నుంచి 23 బైక్‌లు స్వాధీనం చేసుకొని యజమానులకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురు కుప్పం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన కార్వేటినగరంకు చెందిన సుదర్శన్ రాజు (50) శుక్రవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కార్వేటినగరంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

సుదర్శన్ రాజు (ఫైల్)

డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును అసిస్టెంట్ కలెక్టర్ డి.హిమవంశీ సందర్శించారు. శుక్రవారం ఆయన సంతపేటలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డులో పర్యటించి ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ యూనిట్లను పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, విక్రయాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో ఘన వ్యర్థాల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం టి.చవటపల్లి అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సేవలు, టీకాలు కార్యక్రమం అమలు తదితర అంశాలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం అందరి బాధ్యత అని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ తెలిపారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా మున్సిపల్ శాఖ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పుత్తూరు మున్సిపల్ పార్కులో శుక్రవారం పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ, ఇన్‌ఛార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్, వార్డు సచివాలయ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనం మండలం గ్రామపంచాయతీలో 'స్వచ్ఛత హి సేవను ఈవో షణ్ముఖం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించ తదనంతరం మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ ఎంఇవో ప్రభాకర్‌రాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్‌డివేనయ్య, ఏపీఎం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ సర్పంచి బూదూరు వెంకటమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు, పంచాయతీ కార్యదర్శి ఇందిర, ఉప సర్పంచ్ మునిరాజా, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహ నిర్బంధంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి తిరుమల యాత్రకు సంఘీభావంగా వెళుతున్న రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్ బాబును శుక్రవారం పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేసి నోటీసులు అందించారు. పోలీసుల వైఖరిని ఖండించిన తిలక్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అప్రజాస్వామికం దుర్మార్గ చర్యగా ఆయన అభివర్ణించారు.

'షార్'లో కనీస వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: షార్‌కార్మికులకు కాంట్రాక్టర్లు కనీస వేతనం చెల్లించడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు శుక్రవారం ఒక ప్రకటనలో మురళి పేర్కొన్నారు. కేంద్రం 'ఈ మార్కెటింగ్' ప్రవేశపెట్టిన తరువాత దేశ నలుమూలల నుంచి కాంట్రాక్టర్లు శ్రీహరికోటకు వస్తున్నారన్నారు. ఈ కాంట్రాక్టుల్లో ఫిక్స్‌డ్ కాంట్రాక్టు, రేటు కాంట్రాక్టు అంటూ రకరకాల కాంట్రాక్టు పేరుతో ఉన్నా కార్మికులకు పేమెంట్లు సరిగ్గా జరగడం లేదన్నారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లు జిమ్‌లో ఇమడలేక పోతున్నారన్నారు. విజన్ కాంట్రాక్టర్ విడిఎ ఇవ్వలేదన్నారు. కార్మికులు అడిగితే కోర్టులో తేల్చుకోండంటున్నారన్నారు. ఈ విషయమై ఇస్రో ఛైర్మన్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: రైల్వే స్టేషన్లో పనిచేసే శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గూడూరు రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావుకు శానిటేషన్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో పనిచేసే శానిటేషన్ కార్మికులకు జీతాలు ప్రతి నెల సక్రమంగా చెల్లించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించా లన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, సురేష్, బివి రమణయ్య, అడపాలప్రసాద్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఫిజియోథెరపి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరుపతి సిటి: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల పార్మకాలజి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరఫి విద్యార్థులు డ్రాయింగ్, స్కిట్ పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. కె తనూజ, పి మునికృష్ణ, జె శ్రీజ, బేబీ స్వరూప, మేఘన, అభినయలు బహుమతులు పొందినట్లు తెలిపారు. ఫిజియోథెరపి ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి, డాక్టర్ శాంతి పాల్గొన్నారు.

పర్యాటకంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎన్‌సిసి క్యాడేట్లతో 2 ఇంజనీర్ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల నుండి అలిపిరి వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పర్యాటక రంగంపై ప్రజల్లో విస్తృతమైన ప్రచారం ద్వారా అవగాహన తీసుకురావాలన్నారు. తిరుపతి, తిరుమల, చంద్రగిరి వంటి పలు చుట్టుపక్కల ప్రదేశాల్లో పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేకమైన ఎగ్జిబిషన్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించేందుకు ర్యాలీని నిర్వహించామని, ప్రజల్లో పర్యాటక రంగంపై విస్తృతమైన అవగాహన కోసం ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. టిటిడి ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలేజీలోని టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్ మెంట్ శాఖ, హిస్టరీ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తిరుపతి పట్టణంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర, విభాగాధిపతులు డాక్టర్ ఎన్ జగదీష్ కుమార్, కత్తి భాస్కరన్, అధ్యాపకులు డాక్టర్ ఎన్ వినోద్, ఎం. ప్రధా, ప్రియాసింగ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రైతు సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైతు సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు నిలుస్తున్నాయని అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జ్ రవిబాబు పేర్కొన్నారు. తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాళెం సహకార సంఘం కార్యాలయ అవరణలో శుక్రవారం బ్యాంకు మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపునకు తక్కువ గడువు ఉన్నందున రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సహకార సంఘాలను లాభాలబాటలో నడిపించేలా కృషి చేయలన్నారు. రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి ఇప్పటికే రుణాలు ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తున్నామన్నారు. సభలో కొన్ని నూతన పనుల ఆమోదానికి రైతుల సలహాలు స్వీకరించారు. రెండు సంవత్స రాలుగా లావాదేవీలు జరపని సభ్యులను తొలగించారు. ఈ కార్యక్రమంలో సీఈవో చిరంజీవి రెడ్డి, అమరవేలు, మురళీమోహన్ కృష్ణ, పర్యవేక్షకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి రవిబాబు

ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి -కోట : కోట మండలం కేశవరం గ్రామంలో సర్వే నెంబర్ 308, 309, 310 లలో ఉన్న ప్రభుత్వ భూమిని పలువురు భూస్వాములు ఆక్రమించుకుని ఉన్నారని శుక్రవారం కోట తహశీల్దారు కె జయ జయ రావుకు టీడీపీ నాయకులు చాపల శ్రీనివాసులు, పి వేణు, నాగూర్ లు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం తహశీల్దారు కేజయ జయరావు ఆయా భూములను పరిశీలించి న్యాయం చేస్తామని వారికి తెలిపారు.

శివప్రసాద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌వియు సైన్స్ కళాశాల జియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కె శివప్రసాద్‌కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎమ్ దామ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభాగ ఆచార్యులు టి మధు మార్గదర్శకత్వంలో 'ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని పెద్దవాగు నదీ పరీవాహక ప్రాంతంలో రిమోట్ సెన్సింగ్ , జిఐఎస్ పద్ధతులను ఉపయోగించి హైడ్రోజియోలాజికల్ అంశాల సమగ్ర అధ్యయనం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. శివ ప్రసాద్‌కి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ బ్యూరో, హాస్టల్స్, గ్రామీణాభివృద్ధి సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా 'గ్రీన్ టీమ్'ను ప్రారంభించారు. ప్రత్యేక అతిథి ఎస్‌వియూ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఆర్ రామమూర్తి మాట్లాడుతూ కెమికల్స్ ద్వారా పండించే పంటల వల్ల భూమికి, సమాజానికి నష్టం కలుగుతుందని, ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతుల వల్ల మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవచ్చని, నేటి యువతరం ఈ పద్ధతులను అనుసరించాలని కోరారు. సంక్షేమ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టరు గంగాధరం మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ తయారీ విధానం గురించి వివరించారు. కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి 'గ్రీన్ టీమ్' ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రాక్టికల్ గా వివరిం చారు. గ్రీన్ టీమ్ విద్యార్థులు వాళ్ళు చేస్తున్న వ్యవసాయంపై పవర్ పాయింట్ ప్రజెంటే షన్ చేసి చూపిం చారు. తర్వాత విశ్వవిద్యాలయం వసతి గృహాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మాధవి, యువశ్రీ, హేమావతి , రుక్మిణి, పద్మ, వజీహాభాను, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం పంచాయతీకి చెందిన పలువురు వైసిపి నాయకులు శుక్రవారం జనసేనలో చేరారు. మండలంలోని కొత్తపాళెం పంచాయతీ సర్పంచ్ కె సుబ్బరత్నమ్మ భర్త కె హరిప్రసాద్, పార్లపల్లి పంచాయతి సర్పంచ్ ఎన్ వెంకటస్వామి కుమారుడు ఎన్ చలపతితో పాటూ సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలతో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టరు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొప్పల లావణ్యకుమార్, మండల అధ్యక్షుడు బాషా సమక్షంలో జనసేనలో చేరారు. వారికి హరిప్రసాద్ ఆపార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం దిశగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కష్టపడుతున్నారని ఆయన నాయకత్వంలో పనిచేయడానికి చాలా మంది పార్టీలో చేరు తున్నా రన్నారు. ఈ కార్యక్రమం లో పార్లపల్లి పంచాయతీ నాయకులు కొత్తపాలెం గ్రామ పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసిపి నాయకులు

టిడిపి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కొణత నేరి లో శుక్రవారం తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళీ నాయుడు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమది ప్రజా మన్ననలు పొందిన మంచి ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రతినెల ఒకటవ తేదీ పింఛన్ల పంపిణీ, నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టడం, ప్రతినెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించడం, రైతులకు ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించి అన్నదాతలను ఆదుకోవడం, స్థానిక సంస్థలకు కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోయడం, పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రూపాయలతోనే ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్ లను ప్రారంభించడం, ల్యాండ్ టైటిల్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం కూటమి ప్రభుత్వ పాలనలో మైలు రాయిలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి బాలాజీ నాయుడు, పంచాయతీ కార్యదర్శి జలజ, సచివాలయ పోలీస్ చిత్ర, సర్వేయర్ ఆరిఫ్, శీను, రాజేంద్ర, కస్తూరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు గ్రామ సభలు

ప్రజాశక్తి - ఓజిలి : గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడంతో గ్రామ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలు ఏర్పడతాయని సర్పంచ్ యకశిరి రమణమ్మ తెలిపారు. మండల పరిధిలోని గ్రద్దగుంట గ్రామంలో ఎంఈఓ టు చంద్రశేఖర్ , పంచాయతీ కార్యదర్శి రేణుకమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ , మన ఇల్లు మన గౌరవం, విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలపై గ్రామస్తులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన పనులను గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయ్ కుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రక టించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా అర్బన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమి తులైన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి ఊక విజయ్ కుమార్‌కు టిడిపి నాయకులు, యూనివర్సిటీ ఉద్యోగులు ఘన సత్కారం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్ని, సిఎం చంద్రబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి, డిఓఎ డైరెక్టర్ వుకా రమేష్ బాబు, కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పోకనాటి హరికృష్ణ యాదవ్, ఉదయ్, నాథముని, రాజశేఖర్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముఖ్య అతిథులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి కోటశ్వరయ్య. వైస్ ప్రిన్సిపాల్, వీరయ్య, ఏపీ ఎస్ ఎస్‌డిసి జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, సందీప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్, టి నరసింహులు, కళాశాల ఎస్‌పి ఓసి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్స్ రసూల్, సిసింద్రి, అబ్దుల్ అజేష్ అధికారులు పాల్గొనారు. ఈ జాబ్ మేళాలో వివిధ బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాలో సుమారు 56 మంది హాజరుకాగా వారిలో 22 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

DOCUMENTS MISSING

I, P. Babu s/o Late pandugan, aged about 56 years, residing at Konapalli village, periyambadi post, Yadamari Mandal, Chittoor Dist. AP do hereby solemnly affirm and state as follows; I am the deponent herein and residing in the above said address. I submit that, during the life time of my father pandugan purchased the property by way of regd. sale deed dt.16.12.1985 vide Doc.No.8457/1985 and the said document has been loss by me while travelling from Konapalli to Chittoor and inspite of my best efforts I am unable to trace it and it is lost beyond recovery.This affidavit is required for me to produce before the concerned authorities. All the facts stated above are true and correct. Contact No: 9440486111